క్లుప్తంగా

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర ప్రజలకు వీఎంసీ అందిస్తున్న మౌలిక వసతులపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు చిట్టినగర్‌లో ఉన్న సర్కిల్–1 కార్యాలయం, సత్యనారాయణపురంలో ఉన్న సర్కిల్–2 కార్యలయం , పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో కూడా జరుగుతుందని పేర్కొన్నారు. సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్‌లు నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారిస్తారన్నారు. ఈ అవకాశాల్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



వించిపేట(విజయవాడపశ్చిమ):వన్‌టౌన్‌లోని పాత శివాలయం ప్రాంగణంలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ నటరాజ షణ్ముఖం ఆదేశాల మేరకు వీరభద్రస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు చింతలపాటి సూర్యనారాయణ శాస్త్రి అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటలకు స్వామివార్లకు మామిడి, అరటి పండ్లతో అభిషేకం చేశారు. ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను ఉంచి గణపతి పూజ అనంతరం ఉభయ దాతల చేత స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. మధ్యాహ్నం ఉభయ దాతలకు, భక్తులకు, స్వామివారికి నివేదించిన మహా ప్రసాదాన్ని అన్న ప్రసాదంగా అందజేశారు.

కొనసాగుతున్న మజ్జిగ పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ):వేసవి కాలం మొదలైనప్పటి నుంచి హరివిల్లు ఫౌండేషన్ సేవా సంస్థ ప్రతి ఆదివారం నగరంలోని ప్రధాన కూడళ్లలో దాహార్తులకు మజ్జిగ పంపిణీ సేవ కొనసాగుతుంది. ఆదివారం 38వ డివిజన్ పరిధిలోని రథం సెంటర్‌లో ర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత విజయవాడ అన్న నినాదంతో హరివిల్లు ఫౌండేషన్ నిర్వాహకులు మజ్జిగ పంపిణీకి ప్లాస్టిక్ గ్లాసులు వాడకుండా సంప్రదాయబద్ధంగా స్టీల్ గ్లాసుల్లోనే అందించటం అభినందనీయమని తెలిపారు. తద్వారా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు వినూత్న ఆలోచన చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్ కుమార్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా తాము నిర్వహిస్తున్న ఈ నిస్వార్థ సేవా కార్యక్రమాలను చూసి కొంత మంది దాతలు తమ సహకారాన్ని అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హరివిల్లు ఫౌండేషన్ సహాయ కార్యదర్శి యు కనకారావు, కోశాధికారి ఎమ్ రవికుమార్, వీ శేఖర్‌బాబు, బి జంటి, ఇర్షాద్, అప్పలరాజు, కె శ్రీనివాస రావు, పీ త్రినాద్, నజీర్, మహ్మద్, గురురాజ్, పీ లక్ష్మణరావు, శ్యామల, విజయశాంతి, యషిత తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవల భాగ్యం కలిగేనా?

- నాలుగు డివిజన్ల ప్రజలకు అందని బ్యాంకింగ్ సేవలు
- దీంతో అవస్థలు పడుతున్న వైనం
- దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి
- పాలకులు దృష్టి సారించాలంటున్న ప్రజలు



కేఎల్‌రావునగర్ ప్రాంతం



కలరా హాస్పిటల్ పరిసరాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):పశ్చిమ నియోజకవర్గంలోని నాలుగు డివిజన్ల ప్రజలు బ్యాంక్ సేవలు పొందాలంటే ఆమడ దూరం వెళ్లాల్సిందే. చిట్టినగర్ మొదలుకుని పాలప్రాజెక్టు, కంసాలిపేట, పాత రాజరాజేశ్వరిపేట వాసులకు ఒక్కటంటే ఒక్క జాతీయ బ్యాంక్ అందుబాటులో లేదు. పోనీ గ్రామీణ బ్యాంక్ అయినా అందుబాటులో ఉందా అంటే అదీ లేదు. ముఖ్యంగా గతంలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వం పథకాలు పొందాలంటే బ్యాంక్‌లో ఖాతా తప్పనిసరి. సుమారు లక్షకు పైగా పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు నివాసం ఉంటున్న ఈ ప్రాంతంలో బ్యాంకులు తమ శాఖలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదో పాలకులే సమాధానం చెప్పాలి. ఈ నాలుగు డివిజన్లలో డ్వాక్రా గ్రూపుల సంఖ్య తక్కువేమీ కాదు.

డివిజన్‌లో బ్యాంక్ అందుబాటులో లేకపోవడంతో చార్జీలు పెట్టుకుని దూరంగా ఉన్న బ్యాంక్‌లకు వెళ్లి క్యూలైన్లో నిల్చోవాల్సిన దుస్థితి నెలకొంది. కూలీ నాలీ, చిరుద్యోగులైన ఈ ప్రాంతవాసులు బ్యాంక్‌కు వెళ్లాలంటే ఓ పూట పని మానుకోవాల్సిందే. ఆ సమస్య నుంచి తప్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉదయం లేచినప్పటి నుంచి బ్యాంక్‌లతోనే పని....

మనిషి జీవనంలో ఓ బ్యాంక్ సేవలు ముడిపడి ఉన్నాయి. పేద, మధ్య తరగతి వర్గాలు రూపాయి... రూపాయి కూడబెట్టాలన్నా బ్యాంక్ ఖాతా తప్పనిసరి. బ్యాంక్ ఖాతా ఉన్న వారికి కుటుంబంలో ఏ అవసరం వచ్చినా బంగారాన్ని పట్టుకుని బ్యాంకులకు పరుగులు పెడుతుంటారు. బ్యాంక్ అందుబాటులో లేకపోవడంతో వడ్డీ వ్యాపారులను, ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలను ఆశ్రయిస్తున్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో పాటు మహిళల డ్వాక్రా సంఘాలు, ఉద్యోగులకు వేతనాల కోసం బ్యాంక్ ఖాతాలు ఇలా ఏదైనా బ్యాంక్‌తోనే పని.

కీలక ప్రాంతమే.....

నాలుగు డివిజన్లలో అత్యంత కీలకమైన డివిజన్లు రెండు ఉన్నాయి.. 46వ డివిజన్‌లో పాలప్రాజెక్టు, 47వ డివిజన్‌లో నగర పాలక సంస్థ సర్కిల్–1 కార్యాలయాలతో పాటు కేఎల్‌రావునగర్‌లో బ్యాంక్‌కాలనీ, పలు అపార్టుమెంట్లు, ఉద్యోగులు, కంసాలిపేట, పాత రాజరాజేశ్వరిపేటలో పేరున్న అపార్టుమెంటు పదుల సంఖ్యలో ఉన్నారు. ఇక కేఎల్‌రావు నగర్, బ్యాంక్ కాలనీతో పాటు పాలప్రాజెక్టు పరిసరాల్లో చిన్న తరహా పరిశ్రమలు అధికంగానే ఉన్నాయి. వీరందరికీ ప్రతి నిత్యం బ్యాంక్ సేవలు ఏదో ఒక సమయంలో తప్పనిసరి. తాము నివాసం ఉంటున్న ప్రాంతంలో బ్యాంక్ సేవలను పొందలేక, ఈ సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

ఒక శాఖను తరలించేశారు...

పాలప్రాజెక్టు ఆవరణలో కెనరా బ్యాంక్ అందుబాటులో ఉండేది. కేఎల్‌రావునగర్, కలరా హాస్పటల్ ప్రాంతాల వారు ఈ బ్యాంక్‌లో ఖాతాలను తెరిచి సేవలను వినియోగించుకునే వారు. అయితే రెండేళ్ల కిందట ఈ బ్యాంక్ తన శాఖను కబేళా ప్రాంతానికి తరలించారు. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. బ్యాంక్‌కు వెళ్లాలంటే ఆటోలకు రాను.. పది, పోను పది చెల్లించాల్సిన పరిస్థితి. దీనికి తోడు గంటల కొద్దీ సమయం వృథా అవుతుందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు బ్యాంక్ అధికారులతో చర్చించి కేఎల్‌రావునగర్, కలరా హాస్పటల్ పరిసరాల్లో బ్యాంక్ శాఖను ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):పేద విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు, పేద విద్యార్థులకు మేలు కలిగేలా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోసూరి రాజశేఖర్ పిలుపునిచ్చారు. చిట్టినగర్ సొరంగం రోడ్డులోని పుల్లేటికుర్తి ప్రసాద్, అన్నపూర్ణమ్మ విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో ఆదివారం సంఘ రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు విచ్చేశారు. కోసూరి రాజశేఖర్ మాట్లాడుతూ సృష్టి ప్రారంభం నుంచే విశ్వబ్రాహ్మణులు ఎన్నో వృత్తులను ఆచరిస్తున్నారని, అయినా సరే సంఘీయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని పేర్కొన్నారు. వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి రాష్ట్ర ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భవిరి శంకర్ నాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం స్వర్ణకారుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా లక్కోజు రామ్మోహనరావును నియమించారు. పలువురు నేతలు ఆయనను అభినందించారు. రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షుడు డాక్టర్ రామోజీ శ్రీధర్‌రావు, కోశాధికారి కంచనపల్లి గురుబ్రహ్మాచారి, చింతలూరి సత్యనారాయణ, ఎం. శ్రీనివాసరావు, చిన్నోజు సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గట్టు వెనుక ప్రాంతంలో రోడ్లు జలమయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి గట్టు వెనుక ప్రాంతంలోగల పలు రోడ్లు జలమయమయ్యాయంటే డ్రెయినేజి వ్యవస్థ ఎంత అధ్వానంగా ఉందో అర్థం అవుతుంది. విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని కుమ్మరిపాలెం సెంటర్, 39–40 డివిజన్లకు సంబంధించిన ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోగల నాగయ్య హోటల్ సెంటర్, అదే విధంగా 41వ డివిజన్ పరిధిలోని హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ దర్గా ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. చినుకుపడితే కుమ్మరిపాలెం సెంటర్ ముంపునకు గురికావడం సర్వసాధారణమై పోయింది. అయినా నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు పరిచేందుకు గత ప్రభుత్వ పాలనలోనే నిధులు మంజూరయినా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అయినా పక్కా డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు చేపడతారని ఎదురుచూసిన స్థానికులకు నిరాశే ఎదురయ్యింది. ఇక విద్యాధరపురం, భవానీపురం ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్ పరిస్థితి అదే విధంగా ఉంది. ముఖ్యంగా నాగయ్య హోటల్ సెంటర్ తరచూ ముంపునకు గురవుతోంది. ఈ రోడ్డులో పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టినా పూర్తి స్థాయిలో పూర్తి కాకపోవడంతో ముంపు సమస్యకు పరిష్కారం లభించలేదు. కాగా భవానీపురం దర్గా ప్రాంతం చిన్నపాటి వర్షానికి అంతర్గత రోడ్లు వర్షపు నీటితో జలమయం అవుతున్నాయి. ఇక్కడకూడా అస్తవ్యస్త డ్రెయినేజి కారణంగా మురుగు నీరు, వర్షపు నీరు ఎక్కడికీ కదిలే పరిస్థితి లేదు. దర్గా ఉన్న ప్రాంతం జాతీయ రహదారి పక్కనే ఉండటంతో సైడు కాలువల్లోని మురుగునీరు ఎగువకు పారుదల అయ్యే పరిస్థితి లేదు. దిగువకు వెళ్లాలంటే అన్నీ ఆక్రమణలే కావడంతో ఎక్కడి మురుగునీరు అక్కడే ఉండిపోతుంది. సమస్యను పరిష్కరించే దిశలో నగరపాలక సంస్థ అధికారులు ఆలోచన చేయటం లేదనేది స్పష్టం అవుతుంది.



ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోని నాగయ్య హోటల్ సెంటర్



జలమయమైన దర్గా మెయిన్ రోడ్



జలమయమైన కుమ్మరిపాలెం సెంటర్

ఉత్సాహంగా.. ఉల్లాసంగా







వేసవి సెలవుల నేపథ్యంలో కొందరు చిన్నారులు స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈతలో శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రత్యేక శిక్షకులు చిన్నారులకు ఈతలో తర్ఫీదు ఇస్తున్నారు. విజయవాడ గాంధీనగర్‌లోని ఓ స్విమ్మింగ్ ఫూల్‌లో పిల్లలు ఎంతో ఉత్సాహంగా... ఉల్లాసంగా ఈత నేర్చుకుంటున్న చిత్రాలివి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





నేత్రపర్వంగా సంప్రదాయ నృత్యాలు



విజయవాడ కల్చరల్: జేఎంఎస్‌యోగభారతి (అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్) ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా జీవీఆర్ సంగీత కళాశాల్లో ఆదివారం నిర్వహించిన సంప్రదాయ నృత్యహేల కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. యువ నాట్యాచారిణులు జంగం మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తి పర్యవేక్షణలో చిన్నారులు పలు సంప్రదాయ అంశాలను ప్రదర్శించారు. పూర్వంగంతో ప్రారంభించి, నర్తనగణపతిం, జెంజెతనన, అపద రోకు(జావళి) సంచరధర(జయదేవుని అష్టపధి), భామాకలాపం, బృందావన నిలయే, కృష్ణశబ్దం, సందెకాడపుట్టి, ముద్దుగారే యశోద, గోవిందాశ్రిత, చేరియశోదకు అంశాలను ప్రదర్శించి మంగళంతో ముగించారు. 40 మంది చిన్నారులు నృత్య కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్వాహకుడు జంగం శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ సంప్రదాయ నృత్య కళలను పరిరక్షించుకోవాలని సూచించారు. బాల బాలికలలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.

దేశం గర్వించదగ్గ ఇంజినీర్ కేఎల్ రావు

– మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు




డాక్టర్ కేఎల్ రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నో సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన డాక్టర్ కేఎల్ రావు భారతదేశం గర్వించదగ్గ ఇంజినీర్ అని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆదివారం గవర్నర్ పేట ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యాలయంలో వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ ఆడిటోరియం వద్ద కేఎల్ రావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్వర్గీయ కేఎల్ రావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎల్ రావు కృష్ణా జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు. కంకిపాడులో జన్మించిన ఆయన ఇంజినీరింగ్‌లో డాక్టరేట్ పొందారన్నారు. 1961లో తొలిసారి విజయవాడ నియోజకవర్గం నుంచి పార్లమెంటు సభ్యుడిగా ఆయన ఎన్నికయ్యారని తెలిపారు. మూడు సార్లు పార్లమెంట్ సభ్యుడిగా పనిచేశారన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహుదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ మంత్రి వర్గాల్లో పనిచేశారన్నారు. కేంద్ర నీటిపారుదల, విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేసి అనేక నీటిపారుదల, జల విద్యుత్ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారన్నారు. నాగార్జున సాగర్, శ్రీశైలం ఆనకట్టలు నిర్మించారన్నారు. పులిచింతల ప్రాజెక్ట్, ఆయన దూరదృష్టికి నిదర్శనమన్నారు. కేఎల్ రావును ఆదర్శంగా తీసుకుని గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పాటుపడిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గజ్జలకొండ వాసు, ఓబ్బిరెడ్డి వెంకటరామిరెడ్డి, నాయకులు వెన్నం రత్నరావు, చల్ల సుధాకర్, దోనేపూడి శ్రీనివాస్, తాడి శివ, చింత సింహాచలం, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెజవాడలో భారీ వర్షం





విజయవాడలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉన్నా, సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారింది. చల్లటి గాలులతో పాటు వర్షం కురవడంతో ప్రజలు కొంత సేద తీరారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో వర్షంలోనే రాకపోకలు సాగిస్తున్న నగరవాసుల చిత్రాలివి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన కళాక్షేత్ర డాన్స్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన పలువురు కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నాట్య గురువులు గీత, మౌనికల పర్యవేక్షణలో సుమారు 20 మంది విద్యార్థులు తమ నాట్య ప్రతిభను ప్రదర్శించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి విద్యార్థులను అభినందించారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.